క్లుప్తంగా

సీనియర్ సిటిజన్లు సమాజ మార్గదర్శకులు



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: సీనియర్ సిటిజన్లు సమాజ మార్గదర్శకులని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ ముద్రించిన వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, గౌరిశెట్టి విశ్వనాథ్ పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ జోన్లను మార్చాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జగిత్యాల: మున్సిపల్ నూతన మాస్టర్ ప్లాన్‌ను మార్చాలని మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగిత్యాల శివారులోని కండ్లపల్లి చెరువు కింద గల రైతుల వ్యవసాయ భూములు రిక్రియేషన్ జోన్‌లో చేర్చారని, వేరేదానిలోకి మార్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కూతురు శేఖర్ ఉన్నారు.

బీఎస్పీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయ్‌కుమార్

పెగడపల్లి: బహుజన రాజ్యాధికారి కోసం బహుజనులంతా ఏకం కావాలని బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గం ఇన్‌చార్జి నక్క విజయ్‌కుమార్ కోన్నారు. ఈ మేరకు మండలంలోని నామాపూర్ గ్రామంలో మంగళవారం బీఎస్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలు, అగ్రవర్ణాల్లో పేదలందరూ బహుజన రాజ్యస్థాపన కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన పలువురు వివిధ పార్టీల నుంచి బీఎస్పీలో చేరారు. నాయకులు నరేశ్, వికాస్, విష్ణు, వినోద్‌కుమార్, కుమారస్వామి, నవీన్, తిరుపతి, రాజేశం, నాంపల్లి, అంజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సాయిరెడ్డి

మెట్‌పల్లి: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3.50కోట్లు మంజూరు చేసిందని ఎంపీపీ మారు సాయిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మేడిపల్లిలో జిల్లా పరిషత్ నిధులు రూ.3లక్షలతో నిర్మించే సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పూజా సామగ్రి విక్రయాలకు వేలం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పూజా సామగ్రి, ఇతరత్రా విక్రయాల కోసం మంగళవారం సీల్డు టెండర్ల ద్వారా వేలం నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా సామగ్రి ఇతరత్రా విక్రయాల కోసం ఇ–టెండర్, కం–సీల్డు టెండర్ కం వేలం ఏర్పాటు చేశారు. సీల్డు టెండర్ల ద్వారా అధికంగా వచ్చిన వేలంలో వేములవాడకు చెందిన కొసర వసంత్‌కుమార్ రూ.21,51,116కు టెండర్‌ను దక్కించుకున్నారు. టెండర్ కాలపరిమితి రెండేళ్లు ఉంటుందని ఈవో తెలిపారు. రెనొవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, సభ్యులు పాల్గొన్నారు.

19న హైదరాబాద్‌కు తరలిరండి

కథలాపూర్: ఈనెల 19న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రాజు కోరారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని హైదరాబాద్‌లో పర్యటించే ప్రధాని మోదీకి వినతిపత్రం ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు అధికసంఖ్యలో రావాలని విజ్ఞప్తి చేశారు.

ఓపెన్ జిమ్‌లకు మోక్షమెన్నడు?

- రాయికల్‌లో నిరుపయోగంగా మినీస్టేడియం
- వాకర్స్, క్రీడాకారులకు తప్పని ఇక్కట్లు



రాయికల్‌లో వాకింగ్ చేస్తున్న వాకర్స్

రాయికల్: మున్సిపాలిటీలో ఓపెన్ జిమ్‌కు మోక్షం కలగడం లేదు. రాయికల్ పట్టణంలో 12వార్డులు ఉండగా సుమారు 20వేల జనాభా ఉంది. ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసి వాకర్స్‌కు, క్రీడాకారులకు దోహదపడేలా చేసింది. కానీ రాయికల్ మున్సిపాలిటీగా ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ ఓపెన్ జిమ్‌కు మాత్రం మోక్షం లేకపోవడంతో పట్టణంలోని వాకర్స్ జగిత్యాల వెళ్లే రోడ్డు, ఇటిక్యాల రోడ్, వీరాపూర్ రోడ్డు వైపు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వెళ్తున్నారు. మేజర్, చిన్నపాటి గ్రామాల్లో సైతం ప్రభుత్వం సుమారు రూ.2లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నప్పటికీ రాయికల్‌లో మాత్రం ఏర్పాటు చేయకపోవడంతో క్రీడాకారులు, మహిళలు, వాకర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరుపయోగంగా మినీస్టేడియం..

పట్టణంలో క్రీడాకారుల సౌకర్యార్థం కోసం దశాబ్దాల క్రితం అప్పటి ఎమ్మెల్యే రమణ మినీస్టేడియం మంజూరైనప్పటికీ నేటి వరకు పనులు పూర్తి కాకపోవడంతో అది మందుబాబులకు అడ్డాగా మారింది. కాగా మున్సిపాలిటీలో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి రెండు జిమ్‌ల కోసం నిధులు మంజూరైనప్పటికీ స్థలాలు లేకపోవడంతో మున్సిపల్ అధికారులు స్థలాల కోసం అన్వేషణ చేపడుతున్నారు. రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి వెనకాల ఉన్న స్థలాన్ని ఎంపిక చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అంతేకాకుండా పట్టణంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో లేదా, ఇటిక్యాల క్రాసింగ్‌రోడ్, వీరాపూర్ క్రాసింగ్ రోడ్ వద్ద ఖాళీ స్థలాల కోసం అన్వేషణ చేపడుతున్నారు. ఖాళీ స్థలం ఉన్నట్లయితే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ అధికారులు చెప్పినప్పటికీ అమలులో మాత్రం శూన్యంగా మారింది. ఇప్పటికైనా పట్టణ ప్రజల సౌకర్యార్థం పట్టణంలో రెండు చోట్ల, పట్టణ శివారులో మరో రెండు చోట్ల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి



రాయికల్‌లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి. కోరుట్ల, జగిత్యాల రోడ్, వీరాపూర్, ఇటిక్యాల రోడ్ వైపు వాకింగ్ చేస్తూ ఖాళీ ప్రదేశాల్లో వ్యాయామం చేయాల్సి వస్తోంది. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు స్పందించి ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి.

– బొంగోని భూమాగౌడ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

రెండుచోట్లా ఏర్పాటు చేస్తాం



పట్టణంలో రెండు ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం. రాయికల్ మున్సిపల్‌లో స్థలాల కోసం అన్వేషణ చేస్తున్నాం. స్థలాల ఎంపిక పూర్తి కాగానే యుద్ధప్రతిపాదికన ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చూస్తాం.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

సమస్య తీరలె.. సాగుకు నోచుకోలె

- కమ్మునూర్‌లో దళితులకు 36.28 ఎకరాల భూమి కేటాయింపు
- లబ్ధిదారులు, లబ్ధి పొందని వారి మధ్య విభేదాలు
- పంపిణీ జరిగి ఏళ్లు గడుస్తున్నా.. సాగుకు నోచుకోని వైనం



కమ్మునూర్‌లో దళితులకు కేటాయించిన భూమి

సారంగాపూర్: తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేసి.. ప్రతీ దళితుడిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని పేర్కొంది. సదరు అంశాన్ని అమలులోకి తెచ్చేందుకు 2016–17లో బీర్‌పూర్ మండలం కమ్మునూర్, తాళ్ళధర్మారం గ్రామాల్లోని దళితులకు మూడెకరాల చొప్పున భూ పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఆయా గ్రామాల్లోని పట్టాదారులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.3.50 కోట్లు అందించి భూమి కొనుగోలు చేసింది. తాళ్ళధర్మారంలో కొనుగోలు చేసిన భూ పంపిణీ సాఫీగా సాగింది. దానికి అనుగుణంగా లబ్ధిదారులకు కేటాయించిన భూముల్లో బోరు బావులు, విద్యుత్తు మోటార్లను ఏర్పాటు చేసి సాగుకు అనుగుణంగా మార్చి అప్పగించింది. దీంతో అక్కడ నాలుగేళ్లుగా లబ్ధిదారులు పంటలు పండించుకుంటున్నారు.

కమ్మునూర్‌లోనే సమస్య

బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గ్రామంలో దాదాపు 90 శాతం దళిత కుటుంబాలే ఉంటాయి. ప్రభుత్వం దీనిని గుర్తించి అక్కడి దళితులకు భూ పంపిణీ కార్యక్రమానికి గ్రామాన్ని ఎంపిక చేసింది. గ్రామంలోని పట్టాదారుల నుంచి మొత్తం 36.28 ఎకరాలు కొనుగోలు చేసింది. ఎకరాకు పట్టాదారుకు రూ.4.80 లక్షల నుంచి రూ.5.50 లక్షల వరకు చెల్లించింది.

17 మంది ఎంపిక..

కొనుగోలు చేసిన 36.28 ఎకరాల భూమిని పంపిణీ చేయడానికి గ్రామంలోని 17 దళిత కుటుంబాలను ఎంపిక చేసి, వారికి పట్టాలు అందజేసింది. పంపిణీకి ముందు ఎవరికి భూమి వచ్చినా అందరం కలిసి లబ్ధి పొందాలని తీర్మానించుకున్నారు. పంపిణీ తర్వాత లబ్ధిదారులకు, భూమి రానివారి మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో లబ్ధిపొందని 70 శాతం మంది దళితులు ప్రభుత్వం అందించిన భూమిలో తమకు కొంత కేటాయించాలని అధికారులకు సమస్య నివేదించారు. దీంతో సమస్య జటిలంగా మారింది. లబ్ధిదారులకు, లబ్ధి పొందనివారి మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడి పంపిణీ చేసిన భూమిలో ఎవరూ సాగు చేయకుండా అడ్డుకున్నారు. దీంతో ఆరేళ్లుగా సదరు భూములు సాగుకు నోచుకోవడం లేదు.

కోర్టులో కేసు..

లబ్ధి పొందనివారు తమకు భూమి కేటాయించాలని లేదా కేటాయించిన భూమిని సమంగా పంచాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో పంటల సాగుకు విఘాతం ఏర్పడింది. ఇది ఇలా ఉంటే ఆరునెలల క్రితం లబ్ధి పొందనివారి మధ్య, లబ్ధిపొందని వారి మధ్య కొంత చర్చలు జరిగాయి. ఇది సమస్య పరిష్కారం జరగడానికి అవకాశం ఉందని భావించినా ముందుకు సాగడం లేదు.

సమస్య పరిష్కరించాలి



భూ పంపిణీ జరిగినా సమస్య కొలిక్కి రాలేదు. గ్రామంలోని కుటుంబాలతో ఉన్నతాధికారులు చర్చించి, సమస్యను సామరస్యంగా పరిష్కరించాలి. భూమి అందనివారికి మరో విధంగా ప్రభుత్వం లబ్ధి చేకూర్చాలి.

– బందెల మరియ, సర్పంచ్, కమ్మునూర్

గ్రామంలో చర్చలు జరిపాం



కమ్మునూర్ భూ సమస్యకు త్వరలోనే పరిష్కారం దొరుకుతుంది. ఇప్పటికే దీనిపై పలుసార్లు గ్రామంలో చర్చలు జరిపాం. ప్రతీ కుటుంబానికి న్యాయం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనిపై కలెక్టర్ ఇప్పటికే దృష్టిసారించారు.

– లక్ష్మీనారాయణ, డీఆర్‌డీఏ పీడీ

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ రవి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కిడ్జీ స్కూల్‌లో చదువుతున్న పట్టణానికి చెందిన కె.లోకేశ్ పటేల్ ఇటీవల నెల్లూరులోని ఆదాని వరల్డ్ సైనిక్ స్కూల్‌లో సీటు సాధించాడు. ఈ మేరకు విద్యార్థి లోకేశ్‌ను మంగళవారం కలెక్టర్ రవి అభినందించారు.

సంక్షిప్త వార్తలు

✦ విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కోరుట్ల: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఏడీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీటర్లు, బిల్లులకు సంబంధించిన సమస్యలను వినియోగదారులు పరిష్కరించుకోవచ్చన్నారు. కోరుట్ల పట్టణంతోపాటు రూరల్ సమస్యలను కూడా పరిష్కరించుకోవచ్చని ఏడీ చెప్పారు.

✦ ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన బైక్ చోరీ

మల్యాల: మండలంలోని రాజారం గ్రామంలో ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం రాజారం గ్రామానికి చెందిన బత్తుల చంద్రయ్య సోమవారం సాయంత్రం 5గంటలకు తన బంధువు శివరాత్రి అంజయ్య ఇంటి ఎదుట బైక్ పార్కింగ్ చేసి ట్రాక్టర్ పనిమీద వెళ్లాడు. రాత్రి 10గంటలకు తిరిగి వచ్చేసరికి బైక్ లేదు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

✦ పార్కింగ్ చేసిన ఆటో మాయం

మల్యాల: పార్కింగ్ చేసిన ఆటో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన మండలంలోని ముత్యంపేటలోని దిగువ కొండగట్టులో చోటు చేసుకుంది. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం జగిత్యాలకు చెందిన ఆటో డ్రైవర్ ఎండీ.ఆయాజొద్దీన్ ప్యాసింజర్‌తో కొండగట్టుకు కిరాయికి వచ్చాడు. అనంతరం దిగువ కొండగట్టు బస్టాండు వద్ద ఆటోను పార్కింగ్ చేసి హోటల్‌లో భోజనం చేసేందుకు వెళ్లాడు. తిరగి వచ్చేచూసేసరికి ఆటో లేదు. సుమారు రూ.1.50లక్షల విలువైన ఆటో చోరీకి గురైందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

✦ దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో ఏఎన్‌ఎం పోస్టు కోసం మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు మంగళవారం తెలిపారు. ఇంటర్ పూర్తయి ఏఎన్‌ఎం ట్రెయినింగ్ పూర్తి చేసి అనుభవం ఉన్నవాళ్లు 19 నుంచి 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

✦ సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ. 3.23కోట్లు ఉపాధిహామీ నిధులు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గంభీర్‌పూర్‌లో డ్రైనేజీలకు రూ.కోటి, సీసీరోడ్లకు రూ.90 లక్షలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

✦ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం

రాయికల్: బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా సామల్ల సతీశ్ నేత, మండల అధ్యక్షుడిగా ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన బండారి సాయిరాజ్ గౌడ్‌ను నియమిస్తూ మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు



మాట్లాడుతున్న ఎంపీపీ జాజాల భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం: మండలంలోని 17 గ్రామాల్లో సీసీరోడ్లు వేసేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.3.40కోట్ల నిధులను ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు మంజూరు చేయించినట్లు ఎంపీపీ జాజాల భీమేశ్వరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. వైస్‌ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఏలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీలు మమత, రాములు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం



ట్రోఫీతో విజేత జట్టు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో జరిగిన మండల స్థాయి సంక్రాంతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. విజేతగా కింగ్స్ జట్టు, రన్నరప్‌గా రాయల్స్ జట్టు నిలిచాయి. సింగిల్‌విండో చైర్మన్ పాల్సాని నవీన్‌రావు, గుండ సురేశ్ బహుమతి ప్రదానం చేశారు.

అటెన్షన్ ప్లీజ్



పేరుకుపోతున్న చెత్తకుప్పలు

మేడిపెల్లి: మండల కేంద్రం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో ఎస్సారెస్పీ కెనాల్ పక్కన చెత్తకుప్పలు భారీగా పేరుకుపోయి డంపింగ్‌యార్డును తలపిస్తోంది. మేడిపెల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది సేకరించిన చెత్తతో పాటు ఫిష్, మటన్, చికెన్‌సెంటర్ వ్యర్థాలు అక్కడే పడేయడంతో దుర్గంధం వస్తోంది. లక్షలు ఖర్చు చేసి డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేస్తే.. వాటిలో చెత్త వేయకుండా ఇలా రహదారి పక్కన పడేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సంప్రదించాల్సిన అధికారిపేరు : శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి, మేడిపెల్లి
ఫోన్ నంబర్ 99498 82988

ప్రతిభా పరీక్షలు ఆలోచనా శక్తిని పెంచుతాయి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీవో వినోద్‌కుమార్

మెట్‌పల్లి: ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తాయని ఆర్డీవో వినోద్‌కుమార్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 23న నిర్వహించే సైన్స్ ఫెయిర్‌కు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలతో తమలోని సృజనాత్మకత, శాస్త్రీయ నైపుణ్యత ప్రదర్శించడానికి విద్యార్థులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావుతో పాటు ఉపన్యాసకులు గంగాధర్, జగపతి, నర్సయ్య, ప్రతిభ, నవీన్, గణేశ్, రాజు, సాజియా, దశకుమార్, రాజన్న పాల్గొన్నారు.

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ధర్నా చేస్తున్న గల్ఫ్ జేఏసీ నాయకులు

మేడిపెల్లి: గల్ఫ్ బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రూ.500కోట్లతో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ గల్ఫ్ కన్వీనర్ నరేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గల్ఫ్ బాధితుల సమస్యలు పరిష్కారించాలంటూ మంగళవారం గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జగిత్యాల, నిజామాబాద్ జాతీయ రహదారిపై శవపేటికతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమారం మండల కేంద్రానికి చెందిన జుపాల గణేశ్ ఇటీవల దుబాయ్‌లో అనారోగ్యంతో మరణించగా 40రోజుల అనంతరం అతని మృతదేహం స్వగ్రామానికి చేరిందని వాపోయారు. గణేశ్ కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు గణేశ్ మృత దేహంతో కూడిన శవపేటికతో మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గల్ఫ్ జేఏసీ నాయకులు గుగ్గిల్ల రవి, లక్ష్మీపతి, హన్మంతు, నీలం గంగాధర్, లక్ష్మణ్, వినయ్, గల్ఫ్ జేఏసీ నాయకులు, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

మల్లాపూర్: రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీపీ సరోజనతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 38 మంది లబ్ధిదారులకు రూ.16లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మైదాసు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఏనుగు రాంరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు విజయవంతం చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో పుల్లయ్య

పెగడపల్లి: ఈ నెల 19 నుంచి మండలంలో నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీవో పుల్లయ్య కోరారు. ఈ మేరకు పెగడపల్లి మండలం దోమలకుంట గ్రామంలో కంటివెలుగు శిబిరం నిర్వహించే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన వసతులు, సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శని, ఆదివారం మినహా అన్నిరోజుల్లో కంటి పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. మండలంలో మొత్తంగా వంద రోజులు కంటి పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ నిహారిక, వైద్యాధికారి నరేశ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ జయశీల, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం

మేడిపెల్లి: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని గుండ్లపెల్లి గ్రామంలో కంటివెలుగు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 18 నుంచి వందరోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్ కూడా చేస్తారని పేర్కొన్నారు. సర్పంచ్ సంపత్, వార్డుసభ్యులు, వైద్యుల బృందం పాల్గొన్నారు.